కాంగ్రెస్‌కు ఓటేస్తే.. మళ్లీ రోడ్డున పడతాం


రఘునాథపల్లి: యాపలగడ్డ తండాలో మాట్లాడుతున్న కడియం శ్రీహరి


ధర్మసాగర్: మాట్లాడుతున్న కడియం

- ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు కాలుతాయి
- బీఆర్‌ఎస్ స్టేషన్‌ఘన్‌పూర్ అభ్యర్థి కడియం శ్రీహరి

రఘునాథపల్లి: కాంగ్రెస్‌కు ఓటేస్తే పదేళ్ల క్రితం నాటి కష్టాలు మళ్లీ వస్తాయని, ట్రాన్స్‌ఫార్మర్లు పేలి, బావులు, బోర్ల మోటార్లు కాలి రైతులు రోడ్డున పడే పరిస్థితి వస్తుందని ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ స్టేషన్‌ఘన్‌పూర్ అభ్యర్థి కడియం శ్రీహరి అన్నారు. బుధవారం మండలంలోని కుసుంబాయితండా, మంగళిబండ తండా, యాపలగడ్డతండా, పొట్టిగుబ్బటితండా ఆంధ్రతండా, గిద్దబండతండా, కుర్చపల్లి, అయ్యవారిగూడెం, కోమళ్ల బీఆర్‌ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమావేశాలకు వచ్చిన శ్రీహరికి మహిళలు మంగళ హారతులతో ఘనస్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో కడియం మాట్లాడుతూ ఆరు నెలల్లో బొమ్మకూరు రిజర్వాయర్ నుంచి మంగళిబండతండా, పొట్టిగుబ్బటితండా, ఆంధ్రతండా పొలాలకు గోదావరి జలాలు అందిస్తామన్నారు. 35 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎలాంటి అవినీతికి పాల్పడలేదని.. ఆరునూరైనా మాట తప్పను, చెప్పిన మాటకు కట్టుబడి ఉంటానని, ఒక్కసారి అవకాశమిస్తే ఐదేళ్లపాటు సేవకుడిలా పని చేస్తానన్నారు. అన్నమో రామచంద్రా అనే పరిస్థితి నుంచి దేశానికి అన్నం పెట్టే స్థాయికి తెలంగాణను అభివృద్ధి చేసిన ఘనత బీఆర్‌ఎస్‌దే అన్నారు. బీఆర్‌ఎస్ మూడో సారి అధికారంలోకి రావడం, కేసీఆర్ మళ్లీ సీఎం కావడం ఖాయమన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా 24 గంటల విద్యుత్, రైతుబంధు, రైతు బీమా, కల్యాణలక్ష్మి వంటి పథకాలు, అభివృద్ధితో దేశానికి రాష్ట్రం దిక్సూచిగా నిలిచిందన్నారు. ప్రతిపక్షాల మాటలు నమ్మి ఎవరూ మోసపోవద్దని, కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని ఆయన కోరారు. సమావేశాల్లో రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు మారుజోడు రాంబాబు, జెడ్పీటీసీ బొల్లం అజయ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వారాల రమేష్, డాక్టర్ కృష్ణ, మల్కపురం లక్ష్మయ్య, నామాల బుచ్చయ్య, సర్పంచ్‌లు కొంకీస్ పద్మప్రకాశ్‌రెడ్డి, వెంకట్‌నాయక్, మినుకూరి ప్రకాష్‌రెడ్డి, బస్‌సూర్య, కొమురయ్య, నాయకులు దెవేందర్‌రెడ్డి, మద్దపల్లి సునిత, దాసరి అనిత, కుర్ర కమలాకర్, హుస్సేన్, లోనె శ్రవణ్, బండి యాదగిరి, వెంకటేష్ యాదవ్, చెంచు రమేష్, గట్టేశం, రాజేందర్‌నాయక్, రాజిరెడ్డి, వీరన్న తదితరులు పాల్గొన్నారు.


కడియం శ్రీహరికి ఘనస్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

30 ఏళ్ల రాజకీయంలో ఒక్క కేసు లేదు

ధర్మసాగర్: 'నా 30 ఏళ్ల రాజకీయ జీవితంలో చిన్న కేసు కూడా నమోదు కాలేదు. ప్రజలకు నీతి, నిజాయితీగా సేవలందించాను. ఎన్‌కౌంటర్ల సృష్టికర్త అని కొందరు పనికిమాలిన వాళ్లు విమర్శలు చేస్తే ప్రజలు నమ్మరు' అని స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరి అన్నారు. కాజీపేట మండలం మడికొండలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ధర్మసాగర్, వేలేరు మండలాల బీఆర్‌ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సింగపురం ఇందిర తనను ఎన్‌కౌంటర్ల సృష్టికర్త అని ఆరోపణ చేస్తున్నారని, తాను ఏనాడు ఎవరిని ఎన్‌కౌంటర్ చేయించానో నిరూపించాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి ఓ గజ దొంగ, సింగపురం ఇందిరకు నమ్మిన వారినే మోసం చేయడం కొత్తేమికాదన్నారు. ప్రజలను మోసం చేసేందుకు తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, కానీ ప్రజలు నమ్మరని అన్నారు. నేటి నుంచి బీఆర్‌ఎస్ శ్రేణులు గడప గడప ప్రచారాన్ని చేపట్టి ప్రతి ఓటరును కలిసి బీఆర్‌ఎస్ అందించిన సంక్షేమ పథకాలను వివరించాలని కోరారు. 18, 19వ తేదీల్లో మహిళలు ఇంటింటికి వెళ్లి బొట్టు పెట్టి 20న జరిగే కేసీఆర్ సభకు ఆహ్వానించాలని కోరారు. డీసీసీబీ డైరెక్టర్ గుస్‌రెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీపీలు కేసీరెడ్డి సమ్మిరెడ్డి, నిమ్మ కవిత, జెడ్పీటీసీలు చాడ సరిత, పిట్టల శ్రీలత, మండల అధ్యక్షుడు మునిగెల రాజు, కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివునిపల్లిలో ఇంటింటా ప్రచారం

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్‌కు జంటపట్టణమైన శివునిపల్లిలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి గెలుపునకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటా తిరుగుతూ విస్తృత ప్రచారం చేపట్టారు. ప్రచారంలో ఎంపీటీసీలు బూర్ల లతాశంకర్, గుర్రం రాజు, పీఏసీఎస్ డైరెక్టర్ తోట సత్యం, అభ్యుదయయువజన సంఘం అధ్యక్షుడు పోశాల కృష్ణ పాల్గొన్నారు.


చిల్పూరు: సంక్షేమ పథకాలను వివరిస్తున్న చిల్పూరు ఆలయ చైర్మన్ శ్రీధర్‌రావు

నెల్లుట్లలో..

లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్లలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరిని గెలిపించాలని కోరుతూ ఎంపీపీ చిట్ల జయశ్రీఉపేందర్‌రెడ్డి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా సర్పంచ్ స్వరూపరాణిభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కూడా గడపగడపకు ప్రచారం నిర్వహించారు. అదే విధంగా గుమ్మడవెల్లిలో సర్పంచ్ శ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు.

అశ్వరావుపల్లిలో..

రఘునాథపల్లి: మండలంలోని అశ్వరావుపల్లిలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి గెలుపు కోసం ఆ పార్టీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నామాల బుచ్చయ్య, సర్పంచ్ తూముకుంట్ల సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఎన్నికలో కడియం భారీ మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు కుర్ర కమలాకర్‌గౌడ్, నీల ఆగయ్య, కుర్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో కడియంను గెలిపించాలి

చిల్పూరు: బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను గడపగడపకు వివరిస్తూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరిని భారీ మెజార్టీతో గెలిపించాలని చిల్పూరు ఆలయ చైర్మన్, క్లస్టర్–4 ఇన్‌చార్జ్ పొట్లపల్లి శ్రీధర్‌రావు కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు లింగారెడ్డి, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ దూతగా వచ్చాను..


చేర్యాల మండలం కాశగుడిసెల్లో మాట్లాడుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి


పల్లాకు మద్దతు తెలుపుతున్న ఆకునూరు గౌడ కులస్తులు

- ఆశీర్వదిస్తే.. మరింత అభివృద్ధి చేస్తా
- బీఆర్‌ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): ఈప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ పంపితే దూతగా ఇక్కడికి వచ్చాను. మీరంతా ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తానని బీఆర్‌ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని రాంపూర్, కాశగుడిసెలు, ఆకునూరు, కొత్త దొమ్మాట, వీరన్నపేట, చుంచనకోట గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనగామ, చేర్యాల పట్టణ కేంద్రాల్లో నివాసం ఏర్పాటు చేసుకొని ప్రజలకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఇప్పటికే ఎమ్మెల్సీ నిధుల నుంచి కొంత మొత్తాన్ని పలు అభివృద్ధి పనుల కోసం మంజూరు చేశానని తెలిపారు. ఇంకా కొన్ని నిధులు తెచ్చి ఈప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. ప్రత్యర్థులు స్థానికత ప్రచారం మానుకొని సేవలో తనతో పోటీ పడాలని సవాల్ విసిరారు. తన ఆస్పత్రిలో జనగామ నియోజకవర్గ ప్రజలందరికీ ఉచితంగా వైద్య సేవలు అందిస్తానని హామీ ఇచ్చారు. అర్హులకు పథకాలు అందకపోతే ఎన్నికల అనంతరం తానే స్వయంగా పరిశీలించి ఇస్తానని చెప్పారు. గృహలక్ష్మి, దళితబంధు, బీసీబంధు పథకాల్లో అర్హులకు లబ్ధిచేకూరేలా చేస్తానన్నారు. గెలిచిన నెల రోజుల్లోపే చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేస్తూ జీఓ తెస్తానన్నారు. మా పథకాలు కేసీఆర్ కాపీ కొట్టాడని ఆరోపిస్తున్న కాంగ్రెస్ నాయకులు 50 ఏళ్ల పాలనలో ఎందుకు ప్రజలను పట్టించుకోలేదని ప్రశ్నించారు. ప్రజల ఆర్థిక జీవన విధానాలు ఇంకా మెరుగుపడాల్సిన అవసరం ఉందని.. మూడోసారి బీఆర్‌ఎస్‌ను గెలిపించి కేసీఆర్‌ను సీఎం చేయాలని కోరారు. ఎన్నికలప్పుడు మాత్రమే వచ్చే కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మి మోసపోతే ఐదేళ్లు గోస పడాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, ఆప్కో మాజీ చైర్మన్ మండల శ్రీరాములు, రాష్ట్ర నాయకుడు జల్లి సిద్ధయ్య, ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సుంకరి మల్లేశం, పార్టీ మండల అధ్యక్షుడు అనంతుల మల్లేశం, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి, వైస్ ఎంపీపీ తాండ్ర నవీన్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.


జనగామ రూరల్: చీటకోడూర్‌లో వృద్ధురాలిని ఓటు అడుగుతున్న పల్లా నీలిమ

పల్లాకు అండగా నిలవాలి

జనగామ రూరల్: పల్లా రాజేశ్వర్‌రెడ్డికి అండగా నిలవాలని ఆయన సతీమణి నీలిమ కోరారు. ఈ మేరకు బుధవారం మండలంలోని చీటకోడూర్, చౌడారం, మరిగడి గ్రామాల్లో ఆమె ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మహిళలు బొట్టు పెట్టి మంగళహారతులతో ఆమెకు స్వాగతం పలికారు. పల్లాను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. చీటకోడూర్ సర్పంచ్ కొత్త దీపక్‌రెడ్డి, ముక్క రాజయ్య, ఇట్టబోయిన రజిత శ్రీను, పీఏసీఎస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి, ప్రేమలత రెడ్డి, ప్రశాంత్, ఉమాపతితోపాటు తదితరులు పాల్గొన్నారు. అలాగే పల్లా గెలుపునకు మండలంలోని మరిగడిలో బీఆర్‌ఎస్ నాయకులు ఎడ్ల శ్రీనివాస్, నిమ్మల స్వామి ఇంటింటా విస్తృత ప్రచారం నిర్వహించారు.

తండ్రి గెలుపు కోసం తనయుడి ప్రచారం

మద్దూరు(హుస్నాబాద్)/కొమురవెల్లి(సిద్దిపేట): జనగామ బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపునకు ఆయన తనయుడు పల్లా అనురాగ్‌రెడ్డి బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్‌తో కలిసి మండలకేంద్రంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మల్లిపెద్ది సుమలత, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆరీఫ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే మద్దూరు మండలంలోని కమాలయపల్లి, వల్లంపట్ల గ్రామాల్లో ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కొమురవెల్లి మండల కేంద్రంతో పాటు అయినాపూర్‌లో నాయకులు సార్ల కిష్టయ్య, మేర్గు శ్రీనివాస్ ఆధ్వర్యంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు.


జనగామ: 26వ వార్డులో ప్రచారం చేస్తున్న జమున, నాయకులు

26వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రచారం

జనగామ/బచ్చన్నపేట: జనగామ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి మద్దతుగా మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ దూతగా జనగామకు వచ్చిన పల్లాను భారీ మెజార్టీతో గెలిపిస్తే, ఈ ప్రాంతం ఇతర జిల్లాల కంటే మెరుగ్గా అభివృద్ధి సాధిస్తుందన్నారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో మేనిఫెస్టోలో పొందుపరిచిన స్కీంలను ప్రజలకు వివరించారు. మూడో సారి కేసీఆర్‌ను సీఎం చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని బచ్చన్నపేట మండల అధ్యక్షుడు బొడిగం చంద్రారెడ్డి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గెలిపిస్తే అందరికీ అందుబాటులో ఉంటా..


జనగామలో ప్రచారం చేస్తున్న కొమ్మూరి కోడలు దివ్య


జనగామలో బహిరంగ సభను తిలకిస్తున్న ప్రజలు

- కాంగ్రెస్ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

జనగామ: చేర్యాల, జనగామలో సొంత ఇళ్లు ఉన్నాయి.. ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటూ ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానని కాంగ్రెస్ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. సాధారణ ఎన్నికల్లో పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేసి, తెలంగాణ ఇచ్చిన సోనియమ్మ ఆకాంక్షను నెరవేర్చాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలు చేసే గృహలక్ష్మి స్కీంలో నెలకు రూ.2,500, రైతు భరోసా కింద ఏడాదికి రూ.15వేలు, రూ.10లక్షల రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య సేవలు, ఉపాధి కూలీలకు ఏడాదికి రూ.12వేలు, ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షలు, ఉన్నత విద్య కోసం రూ.5లక్షల బ్యాంకు గ్యారంటీ కార్డు, రూ.4వేల పింఛన్, రూ.500లకు గ్యాస్ సిలిండర్ ఇలా ప్రతీ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించి చేతి గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.


అభివాదం చేస్తున్న రేవంత్‌రెడ్డి, కొమ్మూరి

కొమ్మూరితోనే జనగామ ప్రాంతం అభివృద్ధి..

కొమ్మూరి ఎమ్మెల్యేగా గెలిస్తే జనగామ ప్రాంతం రాష్ట్రంలో ఆదర్శవంతంగా తీర్చి దిద్దుతారని కొమ్మూరి కోడలు దివ్య అన్నారు. పట్టణంలోని ఆయా వార్డుల్లో ఆమె ఇంటింటా ప్రచారం చేశారు. దివ్య మాట్లాడుతూ గతంలో ఎమ్మెల్యేగా పని చేసిన సమయంలో కొమ్మూరి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశారన్నారు. ఈ ప్రాంత ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ, భవిష్యత్‌లో మరిన్ని చేసేందుకు అన్ని వర్గాల ప్రజలు మంచి మనసుతో ఆశీర్వదించాలన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ ఎర్రమల్ల సుధాకర్ మాట్లాడుతూ పట్టణంలోని 30 వార్డుల్లో ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారన్నారు. ఆరు గ్యారంటీ కార్డులతో పాటు స్థానికుడైన డైనమిక్ లీడర్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అభివృద్ధి చేస్తాడని బలంగా నమ్ముతున్నారని తెలిపారు. ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు గుణపాఠం చెప్పేందుకు ప్రజలు ఓటింగ్ తేదీ కోసం ఎదురు చూస్తున్నారన్నారు.


జనగామలో ప్రచారం చేస్తున్న సుధాకర్

కేసీఆర్ పాలనపై అపనమ్మకం ఏర్పడింది



దేవరుప్పుల: సీఎం కేసీఆర్ పాలనపై ప్రజలకు అపనమ్మకం ఏర్పడిందని కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని సింగరాజుపల్లికి చెందిన ఓయూజేఏసీ నాయకుడు ఇప్ప పృథ్వీరెడ్డి నాయకత్వాన బీఆర్‌ఎస్ నాయకులు ఝాన్సీరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. నిరుద్యోగ యువత నిస్పృహల్లో ఉన్నారని, బీఆర్‌ఎస్ ప్రభుత్వ పథకాలు డెమోలకు పరిమితమయ్యాయని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు జోగు మల్లయ్య, మట్ట రాములు రచ్చ సోమయ్య, జోగు సోమయ్య, వెంకటయ్య, కృష్ణ, నర్సయ్య తదితరులు ఉన్నారు.

సమస్యలను పట్టించుకునేది ఎర్ర జెండానే



బచ్చన్నపేట: రాష్ట్రంలో ఎక్కడ సమస్య ఉన్నా అక్కడకు వెళ్లి పట్టించుకునేది కేవలం ఎర్ర జెండానే అని సీపీఎం జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి మోకు కనకారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన రాష్ట్రాన్ని అన్ని పార్టీలు పాలించినాయని, కానీ ప్రజల సమస్యలను మాత్రం తీర్చలేక పోయాయని తెలిపారు. స్వలాభం చూసుకోని సీపీఎం పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. నాయకులు బెల్లంకొండ వెంకటేష్, నర్సింహులు, శ్రీనివాస్, బాబు, అశోక్, ఎల్లయ్య, సుగుణమ్మ, పార్వతమ్మ, అండాలు, రేవతి తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉండే నాయకుడిని ఆదరించండి



బచ్చన్నపేట: సాధారణ ఎన్నికల్లో నియోజకవర్గంలో అందుబాటులో ఉండే నాయకుడిని ఎన్నుకోవాలని జనగామ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని, ఆ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. బీజేపీకి ఓటువేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప, మండల అధ్యక్షులు సద్ది సోమిరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ బళ్ల శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

పేదల గుండె ధైర్యం.. వైఎస్సార్



జనగామ: పేదల గుండె ధైర్యం దివంగత మహానేత డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి అని వైఎస్సార్ సీపీ నాయకుడు, ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అభిమాని చిన్నపేట మండలం లింగంపల్లికి చెందిన బొడ్డు ప్రవీణ్‌కుమార్ అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి సీఎం కావాలని ఆకాంక్షిస్తూ బుధవారం జనగామ పట్టణం లేబర్ అడ్డాలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి పాదయాత్ర ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తాడేపల్లిగూడెం వరకు పాదయాత్ర కొనసాగుతుందని ఆయన ఈ సందర్భంగా చెప్పారు.

బోరుకు మరమ్మతు



చిల్పూరు: మండలంలోని నష్కల్‌లో కొద్ది నెలలుగా రామాలయం, శ్మశాన వాటికకు నీరు అందించే బోర్ పనిచేయడం లేదు. విషయం తెలుసుకున్న సర్పంచ్ కర్ణకంటి స్వప్నవెంకటేశ్, రామాలయ చైర్మన్ వంగాల జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే స్పందించి బుధవారం బోర్‌కు మరమ్మతు చేయించి నీటి సమస్యను పరిష్కరించారు. దీంతో సర్పంచ్, చైర్మన్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

యాకమ్మ మృతి తీరని లోటు

జఫర్‌గఢ్: మండలంలోని షాపల్లికి చెందిన సీపీఐ నాయకురాలు, గ్రామ వార్డు సభ్యురాలు కొడారి యాకమ్మ మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ మండల కార్యదర్శి జువారి రమేష్ పేర్కొన్నారు. పార్టీ బృందంతో కలిసి యాకమ్మ మృతదేహాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మృతదేహంపై ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కూరపాటి చంద్రమౌళి, రైతు సంఘం మండల అధ్యక్షుడు ఎండీ యాకుబ్, అన్నెపు అజయ్, ఎండీ జాఫర్, కొడారి సమ్మయ్య, రాజు, తాళ్లపల్లి వెంకన్న, సోమనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

స్టేషన్‌ఘన్‌పూర్: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో రాసమల్ల సురేష్‌బాబు అనే వ్యక్తికి జనగామ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఏడు రోజుల జైలు శిక్ష విధించారని ఘన్‌పూర్ సీఐ రాజు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ వివరాలు తెలిపారు. ఘన్‌పూర్ రైల్వేగేటు సమీపాన అండర్ బ్రిడ్జి వద్ద వారం రోజుల క్రితం డ్రంకెన్‌డ్రైవ్ టెస్టులు చేస్తుండగా వరంగల్ దేశాయిపేటకు చెందిన సురేష్‌బాబు ద్విచక్రవాహనంపై రాగా టెస్టు చేయగా 486ఎంజీ వచ్చిందన్నారు. అతడిని జనగామ కోర్టులో హాజరుపర్చగా ఏడు రోజుల జైలు శిక్ష విధించారన్నారు. మద్యం తాగి ఎవ్వరూ వాహనాలు నడపవద్దని, చట్టరీత్యా తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆర్థిక చేయూత



తరిగొప్పుల: మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంటుగా పనిచేసిన ఎర్రం కనకరాజు అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. కాగా, బాధిత కుటుంబసభ్యులను టీఎన్జీఓ యూనియన్ జిల్లా కార్యదర్శి పెండెల శ్రీనివాస్ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా పూర్వ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం తరఫున రూ.51 వేలు అందజేశారు. అనంతరం పెండెం శ్రీనివాస్ మాట్లాడుతూ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఖాజా షరీఫ్ సహకారంతో మృతుని కుమారునికి కారుణ్య నియామకంలో ఉద్యోగం ఇప్పిస్తామని భరోసా కల్పించారు. నామల పరుశరాములు, బచ్చన్నపేట టీఎన్జీఓ సంఘం కార్యదర్శి తాడెం యాదగిరి, ఎర్రం శంకర్, బాలమల్లు, బాలరాజు పాల్గొన్నారు.


కాంగ్రెస్‌లో చేరిక

కొడకండ్ల: మండలంలోని చెరువుముందు తండా బీఆర్‌ఎస్ సర్పంచ్ ధరావత్ సునీతయాకూబ్‌తో పాటు రంగ్యా, నిమ్మ, కిషన్, కమిలిరాములు, సర్వన్ తదితరులు పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి సమక్షంలో బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలాగే రామవరం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కూడా ఝాన్సీరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సురేష్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప పడిపూజ మహోత్సవం వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

హన్మకొండ కల్చరల్ : వరంగల్ భద్రకాళిరోడ్‌లోని శ్రీధర్మ శాస్తా అయ్యప్ప భక్తసేవాశ్రమంలో డిసెంబర్ 6వతేదీన అయ్యప్ప జన్మనక్షత్ర అష్టాభిషేకం మరియు మహాపడిపూజ మహోత్సవం నిర్వహిస్తున్నామని ఆలయ అర్చకులు గణపతిశర్మ తెలిపారు. బుధవారం ఉదయం సేవాశ్రమంలో నిర్వాహకులు టీఆర్ బాలసుబ్రహ్మణ్యశర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మహోత్సవ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గణపతిశర్మ మాట్లాడుతూ పూజా కార్యక్రమాలలో ఆగమ సామ్రాట్ భద్రకాళి శేషు, శ్రీశంకర గురుకుల వేదపాఠశాల అధ్యాపకులు, వేదపండితులు నారాయణ ఘనాపాటి, వేంకటేశ్వరశర్మలు ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని, ప్రత్యేకపూజలు, అయ్యప్ప స్వామివారికి 18రకాల అభిషేకాలు తదితర పూజాకార్యక్రమాలు జరుగుతాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఓటు హక్కుపై అవగాహన



లింగాలఘణపురం: మండల కేంద్రంలో ఓటు హక్కు వినియోగంపై బుధవారం సారథి కళాకారులు బీఎల్‌ఓ పర్యవేక్షణలో ప్రజలకు అవగాహన కల్పించారు. మద్యానికి, డబ్బుకు అమ్ముడు పోకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాకారులు గణేష్, సంజీవ, రత్నం, శంకర్, శ్రీనివాసు, కనకరాజు, సోమయ్య చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జనగామ :
9951602871
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
శె. మల్లేష్ (S.R): 9849921793 (పాలకుర్తి)
యం.డి. ఖలీల్ (S.R): 8179719313 (జనగామ)
జి. రవియాదవ్ (A.C.O): 9032782191